
# ఇచ్చట ప్లాట్లు అమ్మబడును



రంగనాథభట్టుకు ఆయుర్వేదంలో అంత కలిసి రాకపోవడంతో వేరే ఏదైనా బిజినెస్ చేయాలని ఆలోచించాడు. అయితే తాతలనాటి ఆయుర్వేదం వదలాలంటే భట్టుకు చాలా బాధనిపించింది. మలక్‌పేటలో అతడి మిత్రుడు శేషగిరి రావు చెప్పాడు. 'ఇదంతా ప్రగతి యుగం. తాత తండ్రుల విశ్వాసాలను నమ్ముకొని లాభంలేదు. కావాలంటే నీకు వంద ఉదాహరణలిస్తాను. మా మిత్రుడు శాస్త్రి ఆబిడ్స్‌లో చెప్పుల షాపు పెట్టుకున్నాడు. వాళ్ళ నాయన షట్కాల శివపూజాపరుడు. భాగవతుల చతుర్భుజ శాస్త్రిలేడూ! ఏదీ మూడు పూటలా యజ్ఞం చేసేవాడు. వాళ్ళ కొడుకు ఆర్. ఆర్. కె. పి. పి. పి. రావ్ నాంపల్లిలో బ్రాందీషాపు నడుపుతున్నాడు. బాగా లాభాలు

వస్తున్నాయట కూడాను, అయితే వాళ్ళ నాయన యజ్ఞంలో సోమ రసం తాగేవాడు. ఈయన అలాంటిదే మరొకటి సేవిస్తున్నాడు. కాబట్టి వృత్తిలో కొంచెం పొత్తు కలిసింది. ఏతావతా చెప్పవల్సిందేమంటే భట్టూ, నిక్షేపంలా కొత్త జీవన మార్గమేమన్నా చూచుకో- ఎంతకాలం ఆ మృత్యుంజయ రసం మాత్రలూ, వట్టి వేళ్ళ హల్వా అమ్ముకొని బ్రతుకుతావు?"

"ఇంతకూ నన్ను ఏం చెయ్యమంటావో చెప్పు," అన్నాడు రంగనాథభట్టు.

శేషగిరిరావు ఒక్క క్షణం యోచించి "మలక్ పేటలో ప్లాట్లుబిజినెస్ చేస్తావా?" అని ప్రశ్నించాడు.

"అంటే...."

"అంటే ఏముంది? ఇప్పుడు హైదరాబాదు మొత్తం సాగుతున్నదిదే. ఎక్కడో ఓయాభై ఎకరాలో, వంద ఎకరాలో కొనడం, దాన్నంతా ప్లాట్లుగా విభజించి గజం రెండు రూపాలయనుండి అరవై రూపాయలవరకు డిమాండ్ ను పట్టి అమ్మడం-ఇలా ఒక్కసారి చేశావో చాలు. ఇక నీ జన్మజన్మల దరిద్రమూ తీరిపోతుంది—"

"తినడానికి తిండిలేదు మొర్రో అంటే పోసీ కేకులు తిన మన్నదట ఓ ఫ్రెంచి సామ్రాజ్ఞి. నేను దూరడానికి సందు లేదు. కాని మెడకొక డోలులాంటి ప్లాట్ల బిజినెసా? చాల్లే ఏదైనా పెట్టుబడి లేని వ్యాపారం చెప్పవయ్యా స్వామీ-"

శేషగిరిరావు కేమీ పాలుబోలేదు. ఒక్క క్షణం యోచించి "మీ తండ్రి ఏం చేసేవాడు?" అని ప్రశ్నించాడు.

"ఆయుర్వేద వైద్యం, దేవాలయాల్లో మా రంగనాథస్వామికి పూజలు చేయిస్తూ వుండేవాడు— స్వామిమీద కొన్ని స్తోత్రాలు కూడా చెప్పాడు-ఆ స్ఫూర్తితోనే నేనూ ఒక దండకం వ్రాశాను తిరుమలేశ్వరునిమీద—"

"దటీస్ ది పాయింట్-సంప్రదాయ సిద్ధంగా తండ్రినుండి సంక్రమించిన వృత్తి, కాని నీవు చేయనంటున్నావు - సరే కవిత్వం మొదలు పెట్టు ఈవైద్యం మానేసి. ఏదైతేనేం జనాన్ని చంపడానికి."

"శేషగిరిరావ్! నే నేమంత పెద్ద కవిని గాదే-మా నాయనంటే ఆ రంగనాథస్వామి ఉపాసనవల్ల మహాకవి అయినాడు కాని."

"భట్టూ-మీ నాయనకు రంగనాథుని ఉపాసనవుంటే నీకు మరో రంగసాని ఉపాసనా బలముంటుంది. ఈనాడు హైదరాబాదులో కవిత్వమంతా హోటల్ శ్రీ ఏసెస్‌లోంచే

పుట్టి. డ్రైనేజి పైపుల్లో కాలువలు కట్టి పారుతున్నది. ఫరవాలేదు.... ధైర్యే సాహసే లక్ష్మి దిగు ఫీల్డులోకి...."

శేషగిరి ప్రోత్సాహంతో రంగ నాథభట్టు ఎదలో ఆశలు కొంచెం మోసులెత్తాయి. కళ్ళ ఎదుట రవీం ద్రుని నోబుల్ ప్రైజూ, సత్యనారా యణగారికి వచ్చిన లక్ష రూపా యలూ మెదిలాయి.

"సరే - పట్టుబట్టి కావ్యసాధన మొదలు పెడతాను - జీవితాంతం లోగా జ్ఞానపీఠం రాకపోయినా కనీసం ఒక్క అజ్ఞాన పీఠమన్నా నాకు రాకపోతుందా?" అను కున్నాడు భట్టు.

"సరే శేషగిరీ,సమ్మతించాను. మరైతే ఆయుర్వేదానికిగాను గుళి కలూ, సీసాలు పెట్టుకునే రెండు బీరువా లున్నాయి, ముందు గదిలో వాటిని తీసేస్తే సరిపోతుందా?" అని ప్రశ్నించాడు.

"చాలదు. ముమ్మాటికీ చాలదు. భట్టూ నువ్వు ఇరవయో శతాబ్దం ఉత్తరార్ధంలో జీవిస్తున్నావన్న మాట మరచిపోకు. పబ్లిసిటీ ఈ యుగానికి ప్రాణాధారమైన అంశం.

"ముందుగా ఈ గజకర్ణ రసాయ నాలు, సిద్ధేశ్వర మూలికలూ అన్నీ కోయవాళ్ళ కిచ్చెయ్. గది మొత్తం హావలాక్ హెల్లీస్, అగాథా క్రిస్టీ- కోనన్‌డాయల్, ఆస్కార్ వైల్డ్ వాళ్ల పుస్తకాలతో నింపు. తర్వాత ఈ పంగనామాలూ, తాయెత్తులూ పీకి అవతల పారేయ్-ఓ మోస్తరు జులపాలు పెంచి, లూజుగా వుండే రెండుపైజామాలూ, చేతులు మునిగి పోయే ఓ లాల్చీ కుట్టించు—"

"ఈ తాయెత్తు మా నాన్న కట్టింది" మధ్యలో బిక్కు బిక్కు మంటూ భట్టు ప్రశ్నించాడు.

"భట్, ఈ కవిత్వపు ఎత్తు ముందు తాయెత్తులు పనికి రావు- తండ్రి పెట్టిన తాయెత్తు, తాతలనాటి పిలకా మాత్రమేకాదు. తల్లి పెట్టిన పేరుకూడా మార్చుకోవాలి—"

భట్టు గుడ్లు మిటకరించాడు.

"పేరుకూడానా?"

"ఔనోయ్ మిస్టర్! పేరులోనే కలదు పెన్నిధి మొత్తము అన్నా డొక కవి. రంగనాథ భట్టేమిటి చాదస్తంగా. చాలా మోటుగా వుంది. హిందీలో చూడు నీ అసలు పేరు పుల్లయ్య అనుకో. దానిపక్క పుల్లయ్యచంద్రకాంత్ అనిపిస్తుంది. అంతా చంద్రకాంత్ అనే పిలు స్తారు. రామయ్యపంకజ్, వెంకయ్య ఉలూక్ ఇలా వుంచేనే వాళ్ల సంప్రదాయంలో అందం. అలాగే తెలుగులో ఒక పెలిగ్రామ్య భాష

అభివృద్ధి చెందింది. రంగనాథలో 'రం'.'భట్టు'లో 'భ' కలిపి 'రంభ' అని పేరు పెట్టుకుంటే, అది నేటి సంప్రదాయానికి అనుగుణంగా వుంటుంది-తెలిసిందా?''

'ఇదేమిటి నేనేం ఆడపిల్లనా 'రంభ' అని పేరు పెట్టుకోవడానికి'

'ఆడపిల్లవైనా అదృష్టవంతుడివే అయివుండేవాడివే- పుంఖాను పుంఖంగా నీ రచనలు అచ్చయిపోయేవి. అయినా దిగుల్లేదులే. ఇప్పుడు 'రంభ' అని పెట్టుకో. ఇటు మగ మనిషీ - అటు ఆడ పేరూ రెండింటికీ మధ్యస్థంగా వుంటావు'——

భట్టు ఈ నూతన నామకరణోత్సవానికి అంగీకరించాడు—— అంతే. రంగనాథభట్టు 'రంభ'గా మారిపోయాడు. ''చూడు. నీ నూతన వృత్తికి సంబంధించిన వ్యవహారంలో ప్రథమాధ్యాయం ముగిసింది. ఇక పబ్లిక్ గార్డెన్స్ రోడ్‌లో సన్మానాల పంతులు వున్నాడు. ఆయనను పరిచయం చేసి నేనిక రంగస్థలం నుండి నిష్క్రమిస్తాను''-ఆ రోజే పంతులు గారితో భట్టును భేటీ కలిపి వెళ్లాడు శేషగిరిరావు. సన్మానాల పంతులు భట్టును వెంట బెట్టుకొని ఓ జరదా కిల్లీ బిగించి డాల్టన్ ప్రెస్ మీదుగా పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రవేశించి, కొంచెం జనం తక్కువగా వున్న ఓ ప్రాంతంలో కూర్చొని సంభాషణ ప్రారంభించాడు. ''మీ కేం భయంలేదు-నేనున్నాను అన్నిటికీ-నిర్భయంగా మీరు కవిగా జీవితం ప్రారంభించండి'' అభయహస్త మిచ్చాడు.

ఈ మాటలతో రంభకు నిర్భయానికి బదులు భయం పట్టుకుంది. కవి జీవితం ప్రారంభించడం - ఇదేదో సాగర గర్భంలో సాహస యాత్ర చెయ్యడం లాంటిదన్నట్లు చెపుతున్నాడేమిటీ పంతులు?

''మీరు త్వరలోనే మహాకవి అయిపోతారు- మీ జీవిత చరిత్రలు తగినవారి చేత వ్రాయిస్తాను. మీకు సన్మానాల సభలు ఏర్పాటు చేయిస్తాను. చప్పట్లు కొట్టే మనుషులను కూడా నేనే ఎన్నిలారీలు కావాలో, ముందే కాంట్రాక్టు మాట్లాడి తెప్పించి పెడతాను. మీకు ప్రత్యర్థులెవరో చెప్పండి - వాళ్ళను నామ రూపాలు లేకుండా చేసి అకవిగా చిత్రించేందుకు తోడేళ్ళ లాంటి విమర్శకులను ఉసికొల్పుతాను- అలాగే మీ రచనలను ప్రశంసించే ఉత్తరాలు ఎన్ని వందలు కావాలో ముందే నాతో బేరమాడుకోండి.

అన్ని వందలూ ఆయా వూళ్లనుండి పత్రికా సంపాదకులకూ, ఆకాశ వాణి అధిపతులకూ ముట్టుతాయి"

ఇదంతా వింటుంటే రంభకు తలతిరిగి పోయినట్లనిపించింది. ఈ కవితా వ్యాపారంకన్నా తన సుఖ భేది హల్వా అమ్మకమే తేలికనిపిం చింది. ఇదేమిటీ, పంతులు తానేదో ఎలక్షన్లలో ఎం. పి. కి పోటీ చేస్తుంటే సన్నాహాలు చేస్తున్న వాడిమల్లే చెపుతున్నాడు??

"మీకేం భయం లేదు- నే నున్నాగా అన్నిటికీ- మిమ్మల్ని నిర్మాతల వైపు ఎలా ఫోకస్ చేయాలో నాకు తెలుసు. అయితే వుడ్‌లాండ్స్ పార్టీకి రేటు వేరు. సౌందర్యమహల్‌లో సన్మానానికైతే మరో రేటు. ఇదుగో నా మాట అబద్ధమైతే వడియాల వెంకయ్య గారిని కనుక్కోండి. వారెంత ఇచ్చారో కనుక్కొని, అదే రేటు నా కివ్వండి. తొందరేం లేదు-"

రంభకు అంతా అయోమయంగా వుంది. నాలిక వెళ్ళబెట్టి వింటు న్నాడు.

"మీకేం భయం లేదు- ఇక లేవండి. రేపు అడ్వాన్సు మాత్రం ఓ అయిదు వందలు తెచ్చివ్వండి. చాలు"

"అయిదు వందలే"

"చూడు రంభా! ఇవ్వాళ అయిదు వందలకే 'ఆఁ' అంటూ నోరు తెరిచావే. రేపు లైమ్‌లైట్ లోకి వచ్చాక లక్షలకు లక్షలు వస్తాయే కొద్ది నెలల్లోనే, అప్పుడు మీరు నాకేమన్నా ఓ పదిరూపాయి లిస్తారా? నేను ఇమ్మని అడగ్గలనా చెప్పండి—

నిజమే ననిపించింది రంభకు ఈ ఆర్గ్యుమెంటు-

"చిత్తం- రేపు ఇచ్చుకుంటాను. శాస్త్రోక్తంగా కానివ్వండి ప్రచార పర్వాన్ని"

"మీకేం భయం లేదు పోండి నేనున్నానుగా ఇక" అంటూ లేచాడు.

అన్న ప్రకారం రంభ డబ్బు చెల్లించాడు.

అనుకున్న ప్రకారమే తగిన మోతాదులో పిండికొద్దీ రొట్టె అన్నట్లు తనకు ఇచ్చిన డబ్బుకు సరిపోయినంతగా పంతులు పసం దుగా రంభకు పబ్లిసిటీ ఇప్పించి పెట్టాడు— ఈలోగా తెలంగాణా ఆందోళనవల్ల ఇళ్ళప్లాట్లు అమ్మకం హైదరాబాదులో స్తంభించి పోయింది. సలీంనగర్ కాలనీలో వున్న సోమయ్య హైదరాబాదులో తన ప్లాట్ల బిజినెస్ బంద్ చేసి మద్రాసు చేరుకున్నాడు. పోతూ

పోతూ తన ప్లాట్ల అమ్మకం బోర్డును మిత్రుడు శేషగిరిరావు ఇంట్లో పడేసి పోయాడు. ఇదీ ఒకందుకు మంచిదేనని ఆ బోర్డును ఉదారంగా రంభకు దానం చేసి, తన చేతుల మీదుగా స్వయంగా ఆవిష్కరణ కూడా జరిపి మరీ ఇంటికెళ్లాడు శేషగిరిరావు.

రంభ వాకిట్లోకి వచ్చి చూచు కున్నాడు, 'ఇక్కడ ప్లాట్లు అమ్మ బడును' అన్న బోర్డు ముచ్చటగా వుంది. బోర్డు కూడా వచ్చింది. ఇక ఊరుకుంటే బాగుండదని అందమైన ప్లాట్లని ముందు టోకు గాను, తర్వాత హోల్‌సేల్‌గానూ అల్లడం ప్రారంభించాడు. "కథలు ఎలా అల్లడం??" ఆంగ్లంలో ఆర్డర్ రచనకు తెలుగులో నంగనాచి అను వాదం కూడా చదివాడు రంభ. అందులో ఓ హెన్రీలా శ్రమించి తిరిగితే కానీ ప్లాట్లు దొరకవని వుంది. సరే తిరిగే పని రాత్రికి వాయిదా వేసుకున్నాడు. ప్రకృతి పరిశీలన ముఖ్యం- నిశిత దృష్టి, ప్రతి విషయం ఆమూలాగ్రం తెలుసుకోవడం, కవికీ, కథకునికీ అవసరమని వుంది—

"బాబు! సర్కారు దవాఖాన బంద్ చేసింద్రు. మందుంటే పెట్టుంద్రి. బాంచను నీ కాళ్ళకు మొక్కుతా" వాకిట్లో ఆర్తనాదం- రంభ ఆదుర్దాగా వెళ్లి చూచాడు. చాకలి సమ్మి మోచేతులకు తగిలిన దెబ్బ లతో వచ్చింది. రంభ ఉత్సాహంగా పిలిచి కూర్చోబెట్టి, సమ్మిని ప్రశ్నిం చాడు, అసలెలా దెబ్బ తగిలింది, కథేమిటని- సమ్మి మొగుడు కొమ రయ్య రోజూ గుడుంబా తాగుతాడట. ఆ రోజు కూడా తాగివచ్చి కూడుకు పైసలు లేకుండా చేసినావని అడిగి నందుకు రోషంతో కొట్టాడట, తన్ను కొట్ట వద్దని అడ్డం వచ్చిన మరిది గంగడికి కూడా బాగానే పడ్డాయట—రంజుగా వుంది కథ, —సస్పెన్సు, సాంఘిక దురాచా రం, సెక్సు, అనుమానం, అపా ర్థం—అన్నీ వున్నాయి కథలో. కథకు గంగడి పాత్ర జీవం— సమ్మిపాత్ర కన్నీళ్లు వరదలుగా ప్రవహింపజేయాలి పాఠకులకి. వారపత్రిక చదువుకుంటూ వంట చేస్తున్న స్త్రీల స్టౌలూ, గాస్ పొయ్యిలూ, బొగ్గుల కుంపట్లు అన్నీ ఆ సీటి సెలయేళ్ళతో తడిసి చల్లారి పోవాలి, భేష్ బాగుంది—"సమ్మి, ఇదుగో చూడు నీకు తన్నులు పడ్డ సన్నివేశం కొంచెం నాచురల్‌గా చూడాలి ఇదిగో ఆ డైలాగులన్నీ మళ్ళీ చెప్పు—"

"డైలాగు లేంటి బాబు! లాగులు

బుష్ షర్టులూ ఎరుగుదును కాని డైలాగు లేటవి''

''ఇశ్-సమ్మీ-రాత్రి మీ ఆయన కొట్టబోయే ముందు అన్నమాటలు, నీవు అన్నమాటలు. మరిది అడ్డం వచ్చిన పద్ధతి - అంతా కొంచెం వివరంగా నటించి చూపు. ఏదీ ఎలా వచ్చాడు కొమరయ్య ఇలా తలుపు గుండానా...''

''ఏంది పంతులు. ఇదేం సినిమా బొమ్మనుకుంటివా జబ్బీ- తన్నులకే నేను మొర్రులాడుతుంటే మళ్ళీ అనాలంట అవన్నీ.''

''ఫరవాలేదు సమ్మీ! మా బుజ్జికదా, బంగారం-ఏదీ ఓ చక్కని ప్లాటు దొరుకుతుంది. బోస్టు కూడా పెట్టాను. ఇంక వీల్లేదు. చెప్పు ఆ డైలాగులన్నీ చెప్పు. బంగారు కొండకదూ....''ఇంతలో పెళ్లాన్ని వెతుక్కుంటూ తలుపు తోసుకొని కొమరయ్య ప్రవేశించాడు రంభ ముందు గదిలోకి.

''వహ్వా!-ఇదే నిజమైన డ్రమెటిక్ సీక్వెన్స్ - కొమరయ్యా! ఇప్పుడు నీ డైలాగులు నీవే చెప్పు. నేను గంగడిలా అడ్డు వస్తాను.''

కొమరయ్య దోసులోవున్నాడు. పెళ్ళాన్ని ఓచేత్తో పట్టుకొని లాక్కుపోతూ రంభను ఓ చీమనో, దోమనో చూసినట్లు చూచాడు. రంభ కొమరయ్య చేతినుంచి సమ్మిని బలవంతంగా విడిపించి ''అన్నా ఇది నీకు ధర్మం కాదు. తప్పు తప్పు. డైలాగు సరిగ్గా మాండలికంలో చెప్పలేదు. ఏయ్ బేవకూఫ్ —ఇదేం నీకు కానూనా! పెట్టేందుకేకాని కొట్టేందుకు నీకు జుల్మదారీ లేదురోయ్.'' అంటూ రసావేశంలోకి దిగిపోయాడు. కొమరయ్య రంభను ఒకే దెబ్బకు గోడకు కరిపించి బూతులు తిట్టుకుంటూ పెళ్ళాన్ని ఈడ్చుకుంటూ వెళ్లిపోయిన పది నిమిషాలకు కాని రంభ తిరిగి నరలోకంలోకి రాలేదు.

''ఏం జరిగిందబ్బా? ఎందుకు నేనీమూలకు చేరాను?'' అని స్మృతిపథంలోకి పదినిముషాల ముందు కాలాన్ని బలంగా సంకెళ్ళు వేసి లాగడానికి ప్రయత్నిస్తూ. చేతితో తలను తడుముకోగానే నిమ్మకాయంత బొప్పి తగిలింది. ఓహో! దెబ్బ తగిలిందే అనుకుంటూ అలవాటు ప్రకారం బీరువా వద్ద కెళ్ళి తలుపుతీసి, నారసింహా లేహ్యపు సీసా కోసం వెతుకగా ''ముద్దుకొక దెబ్బ'' అన్న డిటెక్టివ్ ప్లాటు-గత రాత్రే రాసింది - చేతికి తగిలింది. సీసాలన్నీ తీసివేసిన విషయం అప్పుడు జ్ఞాపకానికి వచ్చి, ఇంట్లోకి వెళ్ళాడు రంభ, రసభంగ మయి

నందుకేమీ నిరుత్సాహపడకుండా.

ప్లాటును అన్వేషించడంలో మహామహులకే కష్టాలు తప్ప లేదు. సోమర్‌సెట్ మామ్ ఒక నవలలో రేవు కార్మికుణ్ణి వర్ణించేందుకు గాను విశాఖపట్నం రేవులో బొగ్గుతట్ట మోయడం రంభకు తెలుసు. కాబట్టే తలచుట్టూ గుడ్డ చుట్టుకుని రాత్రి పన్నెండు గంట లప్పుడు ప్రకృతి ఎలా వుంటుందో పరిశీలిద్దామని ముంతాజ్ కాలేజీ వైపు నడక సాగించాడు. అంతా నిర్మానుష్యంగా వుంది. లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి.

"కోన్‌రే వో!" దూరాన బీట్ కానిస్టేబుల్ కేక.

"మైహూ భాయ్. మై రంభా హూ"

"రంభా బోల్తే—క్యా తుమ్ ఆద్మీయా ఔరత్??"

"బీచ్ మే నామ్‌తో రంభ. లేకిన్ కామ్‌తో ఆద్మీకా"

"బేవకూఫ్, పకడోరే ఉస్కో-" పరుగెత్తుకుంటూ ఇద్దరు పోలీసులు వచ్చారు. ఆంధ్రాకాలనీలో అప్పుడే దొంగతనం జరిగింది.

దొంగ ముంతాజ్ కాలేజీ వైపు పరుగెత్తాడు. రంభను బలవంతంగా మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌కు నడిపించారు.

"ఎవరు నువ్వు? నిజంచెప్పు" స్టేషన్‌లో లాటీ చేత్తో పట్టుకొని బెదిరించాదు పోలీసులు.

"మీమీద ఒట్టు. ఖసమ్ ఖాకే మైఁ సహీ బోల్తాహూఁ. (ప్రమాణం చేసి నేను నిజమే చెబుతున్నాను) నా పేరు రంభ. నాది ప్లాట్ల వ్యాపారం."

"ఎక్కడ? బ్రహ్మానంద చిత్ర పురిదగ్గరా ప్లాట్లు?"

"కాదు, ప్లాట్లంటే పత్రికలకు పనికివచ్చే ప్లాట్లు. సినిమాలకి పనికి వచ్చేప్లాట్లు టోకుగాను, హోల్‌సేల్ గానూ అమ్ముతాను. ఏదైనా దొరుకుతుందేమోనని అర్ధరాత్రి బయలు దేరాను?

"దొరికిందా?"

"నిక్షేపంలా- నన్నిలా పోలీస్ స్టేషన్‌కు తీసుకురావడమే పెద్ద ప్లాట్!"

"అరేయ్ మనం ప్లాట్ చేసి (కుట్రపన్ని) వీణ్ణి అరెస్ట్ చేశామట్రోయ్! బద్మాష్‌గాణ్ణి ఆ కొట్లో తొయ్యండిరా.. తెల్లారాక చూచుకుందాం"

రంభ రాత్రి మొత్తం శ్రీకృష్ణ జన్మస్థానంలో గడిపాడు. మర్నాడు ఈయన దొంగ కాదనీ, మందు లిచ్చే డక్టరనీ మలక్‌పేట వాళ్ళు సాక్ష్యం చెప్పినమీదట వదిలి

పెట్టారు వాళ్ళు.

రంభది అసలే గజకేసరి యోగం జ్యోతిశ్శాస్త్రంలో. మకరలగ్నం. ఏది పట్టినా మొసలిపట్టే. అందుకే నిరుత్సాహ పడకుండా చిన్న చిన్న ప్లాట్లు రాసి బీరువాలు నింపడం మొదలుపెట్టాడు. ఈలోగా మలక్‌పేటకు రేస్ సీజన్ వచ్చింది. ఎక్కడెక్కడి వాళ్ళంతా మలక్‌పేటలో వాలడం మొదలు పెట్టారు. పూర్వం నగరానికి చివర బొలారం దోవలో వుండేది. ఇప్పుడు నగర గర్భంలో పెట్టారు. రేస్ కోర్ట్‌ను. ఎటుచూసినా చెవ్రలెట్ ే....రోల్స్ రాయిస్‌లే.

ఆ రోజురాత్రి ఓ ప్లాటు రాస్తూ వున్న రంభకు ప్రక్కమేడలో వేళకానివేళ గాజుల గలగలలూ, సోడాకాయల శబ్దాలూ వినబడ్డాయి. ఏమిటా అని విచారిస్తే అక్కడి కొక నిర్మాత దిగాడని తెలిసింది. తెల్లవారాక రంభ వాళ్లింటి కెళ్లాడు. వాళ్లు తనకు పరిచయస్థులే. లోనికి గౌరవంగా ఆహ్వానించి, 'వీరే రంభగారు. వీరే మా బాబాయి స్వామిగారు' అని ఇరువురికీ పరిచయం చేశాడు సురేందర్—ఇల్లుగలాయన.

"రంభగారూ! మీ రేమేం కథలు వ్రాశారు?" పిగర్ సైజులో గుంటూరు పాటి పొగాకు చుట్ట చుట్టుకుంటూ ప్రశ్నించారు స్వామి గారు.

రంభనవ్వుతూ అన్నాడు. "ముద్దు కొకదెబ్బ! అర్థరాత్రి అనుమానం. ఆరు కొంగలూ, మూడు పిల్లులూ-పిల్లి మెడలో గంట. సమ్మిసౌశీల్యం. సంక్రమణం. సంరంభం. సంతోషం. సంక్షోభం. సంహారం. సంగీతం. ఇలా చాలా ప్లాట్లు వున్నాయండీ"

"అబ్బే. అవన్నీ వద్దు రంభా! చూడు. మా ప్రొడక్షన్ నెంబర్ ఫోర్‌కు మంచి సెంటిమెంటల్ కథ కావాలి?"

"అయితే 'సమ్మి సౌశీల్యం' తీయండి. చాలా బాగుంటుంది. అరవై వారాల హిట్ అవుతుంది. సమ్మి మహా పతివ్రత."

"పతివ్రత అంటే ఒకే భర్త కలిగింది. మరి మహా పతివ్రత అంటే అనేక మంది కలిగిందనా?'

"చిత్తం. కాదనే మన మీ సినిమాలో విరూపిస్తున్నాం. ఆమె భర్త కొమరయ్య తాగుబోతు. భార్య రెక్కల కష్టంతో గుడుంబా తాగుతుంటాడు. ఆమె మరిది గంగులు. మహా అందగాడు. అయితే, గుణవంతుడు కూడాను. ఇక్కడనుండి ప్రారంభ మవుతోంది సస్పెన్స్...."

"చూడు రంభా! కథంటే చాంతాడులా నువ్వు చెప్పినట్లు ఉండటానికి వీల్లేదు. దానికి కొన్ని సినిమా బాక్సాఫీసు సూత్రాలని వున్నాయి. వాటికి లొంగి రావాలి ప్రతి కథ, ప్రతి డైలాగు, ప్రతి యాక్షనూ—తెలిసిందా....!

"చిత్తం"....

"చిత్తం కాదు. విను, కథ మొదట్లో వెంకటేశ్వర స్వామి కాని, శ్రీకృష్ణమూర్తి కాని రావాలి. అప్పుడొక భజన కీర్తన-క్లాప్స్, హాలంతా చప్పట్లు. రిపీటెడ్ ఆడియన్స్ తెలిసిందా...."

"తెలిసింది. అయితే సమ్మిమొదట్లో వెంకటేశ్వరుణ్ని పూజిస్తూ వుంటుంది!

"ఉష్. నీ సమ్మి నువ్వు.... కొంచెం వూరుకోండి, చెప్పింది విని."

"చిత్తం"

'ఆ వెంకటేశ్వరుడి సన్నివేశం కాగానే ఒక బాల్‌రూమ్ డాన్సు రావాలి. హీరోను ఇక్కడే ప్రవేశ పెడతాం. హీరో మన రావుగారే. ఆయన్ని దృష్టిలో పెట్టుకొనే కథ మొత్తం రాయాలి, తెలిసిందా....

"హీరో ధర్మాత్ముడు. / నీతి పరుడు. అయినాసరే సరదాగా అర్ధ రాత్రి బాల్‌రూమ్ డాన్సులు చూస్తూ డాన్సరును అసహ్యించుకుంటూ. మద్యం అందించినప్పుడు పార బోస్తూ వుంటాడు. ఆయన ఎవ్వరికీ లొంగడు. ఒక్క మన హీరోయిన్‌కు తప్ప...."

"చిత్తం అయితే హీరోయిన్...."

"ఉశ్ .... చెప్పింది విను. మధ్యలో మాట్లాడకు. మనకు ఒక హీరోయిన్ ముందే బుక్ అయింది. ఎడ్వాన్స్ కూడా ఇచ్చాం. అయితే ఆమెను నమ్మేందుకు వీలులేదు. నాలుగు రీళ్లు కాగానే మానేయ వచ్చు. అలాంటి తత్వం. అందుకని నాలుగు రీళ్ళు కాగానే హీరోయిన్ చనిపోతుంది మన కథలో!

"ఆమె మానేయకపోతే?...."

"పోతే హీరోయిన్ చనిపోదు. కాని నేనొక కొత్త అమ్మాయికి మద్రాసులో మాట ఇచ్చాను. ఈ సినిమాలో చాన్సు ఇప్పిస్తానని. నాలుగు రీళ్ళు కాగానే ఆ కొత్త తార ప్రవేశించి తీరాలి. వస్తూనే ఆమె కలర్ డాన్స్‌లో కాని రావడానికి వీల్లేదు. అచ్చం హీరోయిన్ లాగే వుంటుంది, ఈమె కూడా. ఇక్కడి నుండి కథలో థ్రిల్ ప్రారంభం."

"అయితే మరి"

"ఉశ్, నోరెత్తకుండా విను

కథ రంభా! ఇప్పుడు మన కథలో ఒక కోయడాన్స్ రావాలి!

"క్షమించండి. ఇది సాంఘికమా, జానపదమా?

"పదహారణాల సాంఘికం, నూరు పైసల వర్తమాన కథ, అయినా సరే కోయడాన్స్ రావల్సిందే. ఇదుగో చూడు మధ్యలో మాట్లాడించవద్దని చెబితే వినవేమిటి? విను ముందు. ఆ కోయ డాన్స్ కాగానే హీరోయిన్ తండ్రి వస్తాడు, ఆయన పెద్ద బూర్జువా, కాపిటలిస్టు, కూతురు మాత్రం సోషలిస్ట్, తండ్రిపైనే కత్తి కడుతుంది. మహా పతివ్రత. ఎవరినీ కన్నెత్తి చూడదు. వాళ్ళింట్లోని గుమాస్తా కొడుకుతో అర్ధరాత్రప్పుడు స్విమ్మింగ్ పూల్ లో మాత్రం డాన్స్ చేస్తుంది. ఈ డాన్స్ మొత్తం కలరే - తెలిసిందా?"

"తెలిసింది. నేను వ్రాసే కథ...."

"విను ముందు. డాన్స్ తర్వాత పబ్లిక్ గార్డెన్‌లో ఇరువురూ ఒక రీలుపొడుగునా పరుగెత్తే దృశ్యం."

"ఎందుకు? వాళ్లు రన్నింగ్ రేస్ కాంపిటీషన్లో పాల్గొంటారా?"

"ఛత్....బాక్సాఫీసు సూత్రాలే తెలియని అజ్ఞుడివి రంభా!"

"క్షమించండి. అపరాధం."

"అలా పరుగెత్తుకెళ్ళాలి. అందుకో అందుకో, అందుకో, అంటూ వెనుక ప్లేబాక్ నడుస్తూ వుంటుంది, అందిరా- కిందికీ కిందికీ అంటూ౦టాడు హీరో."

"మీరే కథ, పాటలు, మాటలు మొత్తం చెప్పేస్తున్నారు."

"అవునయ్యా. నిర్మాతంటే ఏమిటి? ఆఫీస్‌బాయ్ దగ్గర్నించి ఆఖరికి హీరో రాకపోతే వెనుక నుంచి డ్యూప్‌గా కూడా నిలబడి సినిమా ముగించాలి. మంత్రసాని తనానికి ఒప్పుకున్నాక తప్పవుగా ఈ తిప్పలన్నీ. విను....మధ్యలో నా మూడ్ చెడగొట్టకు. అవతల నాకు రేసుకు టైమవుతోంది. ఊ.... ఎంతవరకు చెప్పాను కథ...."

"అందుకో అందుకో అందుకో వరకూ చెప్పారు."

"ఆ! ఆ తర్వాత రేస్ కోర్టు. నేరుగా గుర్రపు పందాలు రావలసిందే. హాల్లో జనమంతా కూడా హో౦య్‌మంటూ సస్పెన్సుతో లేచి, మోకాళ్ల మీద కూర్చోవాలి."

"గుర్రప్పందాలకూ సమ్మిసౌన్‌స్త్రీ లాన్యనికీ ఏమిటి సంబంధం?"

స్వామిగారికి చెప్పలేనంతకోపం వచ్చింది రంభమీద.

"మన బ్రతుక్కూ, కవిత్వానికీ ఏమిటి సంబంధమో అదే. చెత్త

ప్రశ్నలూ నువ్వూనూ. ఎన్నిసార్లు చెప్పినా వినవేమయ్యా పానకంలో పుడకలాగా. గుర్రాలు పరుగెత్తాలి. ఎక్కడ? తెరమీద కాదు - ప్రజల గుండెల్లో, పత్రికల్లో....మన గల్లా పెట్టెల్లో....విన్నావా?"

"అ....ఆఁ—"

"ఇప్పుడు శివుడూ పార్వతీ వస్తారు."

"ఏదీ...ఈ సాంఘికంలోనే!"

"ఆఁ! నేరుగా వచ్చేస్తారు. ఏం, దేవుడు పురాణకాలంలోనే కాని, సాంఘిక కాలంలో వుండకూడదా? వాళ్ళిరువురూ సమ్మిని పరీక్షించా లనుకుంటారు. ఇంతలో ఇంటర్వెల్."

"అబ్బ! ఎంత బాగుంది!"

"ఏంటీ ఇంటర్వెలా?"

"కాదు. మీరు చెప్పిన కథ."

"అప్పుడే ఏమయింది. ముం దున్నది ముసళ్ళపండగ. నాయకు డిప్పుడు మూడు జన్మలెత్తాలి...."

"అమ్మ నాయనోయ్. కళా పూర్ణోదయం తాతలాగుందీ ప్లాటు."

"జన్మకొక భార్య, బ్రతుకొక్క ప్రేమ, ప్రేమకు మూడు పరుగులూ, నాలుగు పాటలూ!!!"

"మొత్తం పన్నెండుపాటలా?"

"కాదు. ఇరవై, బ్యాక్ గ్రౌం డ్లతోకూడా కలిసి. మనదసలు ముప్పయి రీళ్ల సినిమాలే. వీధి భాగవతంలా కోడి కూసేదాకా చూపిస్తాం చక్కగా....ఈ లోపల శివుడూ, విష్ణువూ కొట్టుకుంటారు. రాముడికీ ఆంజనేయుడికీ యుద్ధం. శ్రీ కృష్ణుడికీ అర్జునుడికీ స్టంటు."

"వీళ్ళంతా ఆప్తమిత్రులే.... అదేం పొయ్యేకాలం కొట్టుకో డానికి."

"నువ్వూ నేనూ కొట్టుకుంటే ఎవడు చూస్తారయ్యా! రాముడూ విభీషణుడూ తన్నుకుంటేనే ప్రజలు విరగబడి చూస్తారు. బాక్సాఫీస్ హిట్. గల్లాపెట్టెలో గలగలలూ, పైన దేవతల యుద్ధం. కింద కిరసనాయిల్ డబ్బాలతో హీరోయినూ విలను యుద్ధం. ఈ లోపల హీరో మొసళ్ళ ద్వీపంలో పెద్ద మొసలి నోట్లో పడతాడు."

"అయ్యో! ఇదేం విషాదాంతమా?"

"లేదులే. ఆ మొసలి అసలు మొసలికాదు. హీరోతండ్రే అలా వేషం వేసుకుంటాడు. ఇక్కడి నుండి బ్లాక్ అండ్ వైట్ మానేసి, సినిమా ఈస్ట్‌మన్ కలర్‌లో ప్రారంభమవుతుంది. ఇక చూసుకో ....థ్రిలర్, సస్పెన్స్, క్లైమాక్స్ టెంపో, థ్రిల్లర్."

ఈ లోపల ఫోను మోగింది. స్వామి అందుకొని "ఎవరూ! రావ్ బహద్దూర్ గారే! ఆ....వచ్చేస్తున్నా! అయిదు నిమిషాల్లో, ఓకే...." అని ఫోను పెట్టేసి, "ఇదిగో అవతల గుర్రపుపందాలకు టైమయింది. నీ సమ్మిశ్ర సౌశీల్యం ఇలా పడెయ్యి.... పరిశీలిస్తాం మద్రాసులో"

రంభ కథను స్వామిగారి చేతి కిచ్చి లేచి నిలబడ్డాడు.

"మంచిది వెళ్ళి రండి"

రంభ ఇంటి ముఖం పట్టాడు ఉత్సాహంగా గాలిలోకి ఫ్లూగుతూ. ఆ రాత్రి రంభకసలు నిద్రపట్టలేదు. తన ప్లాట్లన్నీ రెక్కలు కట్టుకుని ఒక్కొక్కటే వెండితెర మీద ఎగురుతున్నట్లు కల వచ్చింది. మర్నాడే ప్రెస్సు కెళ్ళి సినీ స్టోరీ అండ్ స్క్రిప్ట్ రైటర్ అని లెటర్ హెడ్స్ అచ్చుకొట్టించుకొని తెచ్చుకొన్నాడు.

అయితే రంభ పంపిన ఏ ప్లాటూ పత్రికలలో పడలేదు. కొద్దిరోజులు తేడాగా అన్నీ తిరిగి వచ్చాయి. ఆఖరికి సమ్మిశ్రసౌశీల్యం కథకూడా 'మా కక్కర లేదు' అని తిప్పి పంపారు. అన్నిటినీ భద్రంగా తిరిగి బీరువాలో చేర్చాడు రంభ. కొద్దిగా పెళ్ళిళ్ళ పంచరత్నాలు, రెండు షష్టిపూర్తి గీతాలు మాత్రం ఖర్చయినాయి. కల్పానికి బదులు కాగితంపై రంభ అదే వూగుతో, అదే తూగుతో కవిత్వ రసాయనాన్ని నూరి బీరువా కెక్కించడ మయితే చేస్తున్నాడు. కాని పంతులు కిచ్చిన సన్మానం డబ్బుకూడా ఇంకా తిరిగి రాలేదు. "ఏమిటి నీ పిచ్చి బంగారం వంటి వైద్యం మానేసి? ఈ చెత్త నంతా బాయిలర్‌లో వేస్తేసరి" అని బెదిరించింది భార్య. ఇలా వుండగా ఒకరోజు భార్య బాధపడలేక కమల్ టాకీస్ దగ్గరగా వుందికదా అని సినిమా కెళ్ళారు. 'అనుమానాలూ-ఆంతర్యాలూ' అన్న సినిమా ఈస్ట్‌మన్ కలర్‌లో కథ మొదలైంది. తనదే, సమ్మిశ్రసౌశీల్యాన్నే తీశారు. "కథ స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్, నిర్మాణం, దర్శకత్వం - స్వామి" అని వుంది. టైటిల్స్‌లో. రంభ గుడ్లు మిటకరించాడు. పిచ్చెక్కినట్లు జుట్టు పీక్కున్నాడు. "ఇది నా ప్లాటు" అన్నాడు పక్కనున్న లక్ష్మమ్మతో. ఆమెఓ చిరునవ్వు నవ్విందిభావగర్భితంగా.... "నీ మొఖానికి సినిమా ప్లాటు కూడానా" అన్న అర్థం స్ఫురించేటట్టు. రంభ మొఖం నెత్తురు లేకుండా పాలిపోయిందికొద్ది సేపట్లోనే. ఆట ముగిశాక బయట కొచ్చారు దంపతు లిద్దరూ. జనం విరగబడి చూస్తున్నారు సినిమా.

హావుస్ ఫుల్ వారం రోజుల వరకూ—

"ఇది నాదే ప్లాటు- అక్షరాలా నా ప్లాటు" పెద్దగా అరిచాడు పిచ్చి వాడిలా—

జన మంతా ఇటు చూచిందొక సారి—

శ్రీలక్ష్మి భయపడిపోయింది—

బలవంతాన రిక్షా ఎక్కించి ఇంటికి తీసుకొనిపోయింది—

ఇంటి తలుపుతీసి భర్తనో కుర్చీలో కూర్చోబెట్టి "అమృతం లాంటి మందులు మూలపారేసి అడ్డమైన కాగితాలూ బీరువా కెక్కించారు - ఎక్కడ పెట్టారండీ ఆ చందనాది తైలం??" అని, మూల నున్న సీసాలను వెదికి కాస్త తైలం భర్త తలకు మర్దించింది... రంభ అలాగే గుడ్లు మిటకరించి చూస్తున్నాడు.

మెల్లగా పక్కమీద పడుకో పెట్టింది భార్య.

తెల్లవారు ఝామున రంభకొక కల—బీరువాలోని ప్లాట్లన్నీ పైకెగిరిపోతున్నట్లూ, సీసాలు ఒక దాని తర్వాత ఒకటి క్యూలో మళ్లీ బీరువాలోకి ఎక్కుతున్నట్లూ—

"అయ్యో నా ప్లాట్లు నా ప్లాట్లు" అరుస్తూ లేచాడు రంభ.

"ఏమిటండీ ఏమయింది?" బాయిలర్ భగ భగ వెలుగుతున్నది.

"కల వచ్చిందే- కల—సీసాలన్నీ బీరువాల్లోకి ఎక్కినట్లు—"

"ఇది కలకాదు ఇలే- లేచి ముఖం కడుక్కోండి కాస్త నిమ్మరసం ఇస్తాను ముందుగా—" కాగితాల కమురు కంపు కొడుతున్న బాయిలర్ మంటను పైనుండి పొడుగుపాటి కర్రతో ఎగదోస్తూ అన్నది శ్రీలక్షమ్మ. *

